సాక్షి చిత్తూరు

శుక్రవారం । 21 । జూలై । 2023



ఆధార్ అనుసంధానం తప్పనిసరి

ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరని అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు.

- 8లో



మీ అమ్మాయికి ధన పిశాచి పట్టిందని..

మీ అమ్మాయికి ధనపిశాచి పట్టిందని బురిడీ కొట్టించి మోసగించిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు.

- 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	35	27
తిరుపతి	36	27
తిరుమల	31	23
గూడూరు	38	29
నగరి	37	28

న్యూస్‌రీల్

నేడు ఉద్యోగుల గ్రీవెన్స్ డే

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ఉద్యోగులకు ప్రత్యేక గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి ప్రతి మూడో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తామని చెప్పారు. కలెక్టరేట్‌లో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఉద్యోగులు సమస్యల వినతులను అందజేసి ను పరిష్కరించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీప్లస్ గ్రేడ్



ప్రిన్సిపాల్ విజయులురెడ్డి

కార్వేటినగరం: కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ బృందం బీప్లస్ గ్రేడ్ ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి తెలిపారు. గురువారం కళాశాలలో విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 12,13 తేదీల్లో నేషనల్ అసెస్మెంట్ అక్రిడిటేషన్ కమిటీ(ఎన్‌ఎఏసీ) బృందం కళాశాలను సందర్శించిందని పేర్కొన్నారు. మౌళిక వసతులు, క్రీడా విభాగం, లైబ్రరీ విభాగం, ప్రయోగశాల, డిజిటల్ తరగతులు, సామాజిక సలహా కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిందని తెలిపారు. దీంతో కళాశాలకు బీ ప్లస్ గ్రేడ్‌ను ఇచ్చినట్లు తెలిపారు.

అట్రాసిటీ కేసుల్లో సత్వర న్యాయం



మాట్లాడుతున్న ఆర్డీఓ రేణుక

చిత్తూరు కలెక్టరేట్ : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ఆర్డీఓ రేణుక అన్నారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి నిర్ణీత గడువులోపు చార్జ్ షీట్ దాఖలు చేయాలన్నారు. బాధితులకు ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయాన్ని సకాలంలో అందే విధంగా చూడాలన్నారు. ఏవో రామాంజులు నాయక్, తహశీల్దార్లు మురళీమోహన్, సుశీల, కళావతి, సీఐ విశ్వానాథరెడ్డి, కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, డేవిడ్, ఎల్లప్ప, దేవరాజులు, బాబు, పోలీసులు పాల్గొన్నారు.

జాతీయ చెస్ పోటీలకు ఎంపిక



ప్రణవి

పుంగనూరు: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కె.ప్రణవి జాతీయస్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రుద్రాణి తెలిపారు. గురువారం సాయంత్రం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత నెలలో జరిగిన చెస్ పోటీల్లో ప్రణవి రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపికైందన్నారు. పట్టణంలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న కె.సుబ్రమణ్యం, నవనీత దంపతుల కుమార్తె ప్రణవి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో కోచ్ మణికంఠ, ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు అభినందించారు.

ముగిసిన రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా రేషన్ పంపిణీ గురువారంతో ముగిసింది. 20 రోజులపాటు రేషన్ పంపిణీ చురుగ్గానే సాగింది. పంపిణీ 88 శాతం పూర్తయిందని డీఎస్‌ఓ శంకరన్ బుధవారం తెలిపారు.

ఏనుగుల కట్టడికి చర్యలు



చీఫ్ కన్జర్వేటర్ నాగేశ్వరరావు

సోమల: ఏనుగులు పంట పొలాలపైకి రాకుండా కట్టడి చర్యలు తీసుకుంటున్నట్లు, ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోతున్న రైతులకు పరిహారం అందిస్తున్నట్లు అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ నాగేశ్వరరావు తెలిపారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. మండలం సరిహద్దులో 16 ఏనుగులు తిరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఏనుగులు పొలాలపైకి రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఇటీవలే పుంగనూరులో రెండు కొత్త బేస్ క్యాంపులు నిర్వహించినట్లు తెలిపారు. ఒక్కో బేస్ క్యాంపులో ఐదుగురు సిబ్బంది 24 గంటలు ఉంటారని, ఏనుగుల కదలికలను ఎప్పటికప్పుడు చెబుతూ ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో డ్రోన్ల ద్వారా కూడా వాటి కదకలను పసిగట్టి ముందుగానే అప్రమత్తం చేస్తామని వివరించారు.

పాల సేకరణలో అగ్రగామిగా..

నాడు పాల ఉత్పత్తిలో చిత్తూరు జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానం.. దేశంలో రెండో స్థానంలో ఉండేది. అంతటి ప్రతిష్టాత్మకమైన చిత్తూరు డెయిరీ నాటి చంద్రబాబు పాలనలో నిర్జీవమైంది. పాడిరైతుల భవిష్యత్‌తో ముడిపడిన చిత్తూరు డెయిరీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పునరుజ్జీవం ఇచ్చారు. అమూల్ కంపెనీ సంస్థకు అప్పగించి తిరిగి ప్రాణం పోశారు. ఉత్పత్తులు ప్రారంభించే నాటికి పాలసేకరణలో దేశంలో మొదటి స్థానం చేరుకోవాలని సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు. ఆమేరకు జిల్లా కలెక్టర్‌తోపాటు జిల్లా పశు సంవర్థకశాఖాధికారులు భవిష్యత్ కార్యాచరణ కోసం పక్కా ప్రణాళిక రూపొందించారు. రోజుకు 30 లక్షల లీటర్ల పాలు సేకరించాలని లక్ష్యం నిర్దేశించుకుని చర్యలు ప్రారంభించారు.

- రోజుకు 30 లక్షల లీటర్ల పాల సేకరణకు చర్యలు
- దేశంలోనే నంబర్‌వన్ కావాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం
- పాడి రైతుకు మేలు జరిగేలా పశు సంవర్ధకశాఖ ప్రణాళిక
- అమూల్ సంస్థ ద్వారా పాడి రైతులకు మంచి రోజులు
- పశు పోషణ వ్యయం తగ్గించి అధిక పాల ఉత్పత్తికి చర్యలు



చిత్తూరు: పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా మేలైన యాజమాన్యంపై సూచనలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్ (ఫైల్)

సాక్షి, చిత్తూరు : పాల ఉత్పత్తిలో దేశంలోనే చిత్తూరు జిల్లాను మొదటి స్థానంలోకి తీసుకొచ్చి పాడి రైతులకు మేలు చేయాలని ఇటు జిల్లా యంత్రాంగానికి అటు అమూల్ సంస్థ యాజమాన్యానికి ముఖ్యమంత్రి దశాదిశ నిర్దేశించడంతో ఆమేరకు చర్యలు ప్రారంభమయ్యాయి. చిత్తూరు డెయిరీపై జిల్లా కలెక్టర్‌తోపాటు జిల్లా పశుసంవర్థక శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రస్తుతం జిల్లాలో 21 డెయిరీల ద్వారా18 లక్షలు లీటర్ల పాలు సేకరిస్తుండగా, చిత్తూరు డెయిరీతో కలిపి ఆ సంఖ్యను 30 లక్షల లీటర్ల పాలను సేకరించేలా టార్గెట్ పెట్టుకున్నారు. డెయిరీ పూర్తిస్థాయిలో ప్రారంభం అయ్యేందుకు మరో 10 నెలల సమయం పట్టే అవకాశం ఉంది. అంతలోపే జిల్లా వ్యాప్తంగా పశువుల రక్షణ, పశుగ్రాసం, దాణా వంటి అంశాలపై దృష్టి సారించారు. నాణ్యమైన పశుగ్రాసం అందించి పశుగ్రాస విస్తీర్ణం కూడా పెంచేలా చూడాలని నిర్ణయించారు. నాణ్యమైన, పరిశుద్ధాత్మక దాణా ఇక్కడే సరఫరా అయ్యే విధంగా చర్యలు చేపట్టారు. దీనివల్ల అధిక పాల దిగుబడి పొందవచ్చునన్న శాస్త్రవేత్తలు సూచనల్ని అమలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. పశువుల సంక్షరణ కోసం లైవ్ స్టాక్ యూనిట్లు, హెల్త్ సెంటర్లు, 1902 వంటి వాహనాలు, జిల్లా వ్యాప్తంగా 666 మంది సిబ్బంది అందుబాటులో ఉంచారు. ఇలా జిల్లా యంత్రాంగం పశు గణాభివృద్ధికి, నాణ్యమైన పాల ఉత్పత్తికి చర్యలు తీసుకుంటోంది. జిల్లా వ్యాప్తంగా పశుగ్రాస వారోత్సవాలు ఈనెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహించారు. ఈ వారోత్సవాల్లో ప్రధానంగా పశుగ్రాసంతోపాటు ఇతర దాణా విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి రైతులకు అవగాహన కల్పించారు. పశు పోషణ విషయంలో ఖర్చు ఏ విధంగా తగ్గించాలి? తద్వారా పాడి రైతుకు లాభదాయకం కోసం ఎలాంటి విధానాలు అనుసరించాలి? అన్న అంశాలపై రైతుల్లో చైతన్యం పెంచారు. ఈ కార్యక్రమాలు పాడి రైతుల్లో జోష్ నింపింది. అధికారుల చర్యలపై రైతుల్లో హర్షం వ్యక్తమైంది.

అమూల్ డెయిరీతో ఎంతో లాభం



రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు అమూల్ సంస్థ ఉత్పత్తులను త్వరలో ప్రారంభిస్తుందని తెలిసి సంతోషిస్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం ఎంతో ఆనందానిచ్చింది. అమూల్ సంస్థ రాక ద్వారా జిల్లాలో పడమటి ప్రాంతాల్లో మంచి ధరలు ఇస్తున్నారు. అదే ధరలు చిత్తూరు జిల్లాలో కూడా ఇస్తారు.రైతులకు మరింత లాభం చేకూరనుంది.

–మార్కండేయులు, పాడిరైతు, ఎల్‌బీపురం, చిత్తూరు మండలం

పాలకు మంచి ధర వస్తుంది



అమూల్ డైయిరీ ప్రారంభించడం ఆనందదాయకం. పాలకు మంచి గిట్టుబాటు ధర వస్తుంది. రైతులు మరింత లాభపడుతారు. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయాన్ని హర్షిస్తున్నాం. వారోత్సవాలు సందర్భంగా పాల సేకరణకు సంబంధించి అధికారులు నిర్వహణ వ్యయం తగ్గించేలా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ చర్యలు తీసుకోవడం ఆనందదాయకం.

–హరికృష్ణారెడ్డి, ఉద్యాన, పాడి రైతు, దాసరాపల్లి(పెనుమూరు)

పాడిరైతులకు వెన్నుదన్ను



తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చేలా నాణ్యమైన పశుగ్రాసం అందించి రైతుకు మరింతలాభం చేకూర్చడమే ధ్యేయంగా పశుగ్రాసం వారోత్సవాలు నిర్వహించాం. పాడిరైతులకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిచేలా కార్యాచరణ అమలు చేస్తున్నాం. పాల ఉత్పత్తికి తీసుకోవాల్సిన చర్యలపై చైతన్యం తీసుకు వస్తున్నాం.

–ప్రభాకర్, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి, చిత్తూరు

మేలైన పశుగ్రాసం, దాణాతో అధిక దిగుబడి



పశువుల పెంపకంలో దాణి, పశుగ్రాసం అతి ప్రధానం. దాణా ఖర్చులు తగ్గించే అదేవిధంగా నాణ్య మైన పశుగ్రాసం ఇవ్వడం ద్వారా ఖర్చులు తగ్గించేందుకు వీలు ఉంటుంది. పశు సంవర్ధక శాఖ వారు మేలైన గడ్డి జాతిని కనుగొన్నారు. వీటిని ఉపయోగించుకోవడం ద్వారా పెట్టుబడి తగ్గించుకుని ఆదాయం పొందవచ్చు.

–డాక్టర్ పి.అరుణ,శాస్త్రవేత్త, కెటిల్ ఫారం మేనేజర్

తక్కువ పెట్టుబడితో



జిల్లాలో సుమారు 5.5 లక్షలు పాడి పశువులు ఉన్నాయి. పంటల సాగుతోపాటు రైతులు పాడి పరిశ్రమపై ప్రధానంగా జీవిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మంచి ధరలు వచ్చేలా చూస్తోంది. అమూల్ కంపెనీకి చిత్తూరు సహకార డైయిరీని లీజు పద్ధతిలో అప్పగించాం. మరో 10 నెలల్లో పాల కొనుగోలు, ఇతర ఉత్పత్తులు ప్రారంభమవుతాయి. నాణ్యమైన పాలను తక్కువ పెట్టుబడితో సాధించాలని రైతులకు వారోత్సవాల సందర్భంగా సంపూర్ణ అవగాహన కల్పించాం.

– సగిలి షణ్మోహన్, జిల్లా కలెక్టర్

బాబు వస్తే సంక్షోభం.. జగనన్న వస్తే సంక్షేమం



మీడియాతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- దుష్టశక్తులన్నీ ఒకటవుతున్నాయ్
- ఏమారితే భవిష్యత్తు అంధకారమే
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: పేదల రక్తం పీల్చేందుకు దుష్టశక్తులంతా ఒక్కటై వస్తున్నాయని, అధికారం కోసం, పెత్తందార్ల కోసం ప్రజలపై దాడి చేసే పరిస్థితులు రానున్నాయని విపక్షాల తీరుపై ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి తీవ్రంగా విమర్శించారు. గురువారం మండలంలోని కొమరగుంటలో మీడియా సమావేశంలో నారాయణస్వామి మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడూ ఏ రోజూ ప్రజల భాగోగులు పట్టని చంద్రబాబు, ప్రజలకు ఏమి చేస్తాడో ఎలాంటి మేనిఫెస్టోలేని పవన్ కల్యాణ్, వారితోడుగా వంతపాడుతున్న ఎల్లో మీడియా రానున్న రోజుల్లో అనేక కట్టుకథలు అల్లి ప్రజలను పక్కదారి పట్టించనున్నాయని, ప్రజలు అప్రమత్తంగా లేకుంటే భవిష్యత్తు అంధకారమేనని పేర్కొన్నారు. పరిపాలనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి ప్రజల వద్దకే పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎల్లోమీడియా నిత్యం ఏదోరకంగా దుష్ప్రచారం చేస్తున్నట్లు మండిపడ్డారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లపై ఇటు చంద్రబాబు అటు పవన్ పనిగట్టుకుని అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. గ్రామవలంటీర్లు తిరగబడితే ఎక్కడా వారు అడుగుపెట్టలేరని చెప్పారు. ప్రతి గ్రామంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, సిమెంటు రోడ్డు నిర్మాణాలు దర్శనమిస్తుంటే అభివృద్ధి జరగలేదంటూ చంద్రబాబు అండ్ కో అవాస్తవ ఆరోపణలు చేస్తున్నాయని చెప్పారు. చంద్రబాబు వస్తే సంక్షోభం , జగనన్న వస్తే సంక్షేమమని పేర్కొన్నారు. జగనన్న మళ్లీ సీఎం అయితే ఇప్పుడు అందిస్తున్న పథకాలతో పాటు మరిన్ని తీసుకొస్తారని చెప్పారు.

సచివాలయాలే సేవాలయాలు



జగన్నాథపురంలో సచివాలయం ప్రారంభిస్తున్న మంత్రి ఆర్కే రోజా

- గ్రామ స్థాయిలోనే సమస్యల పరిష్కారం
- అన్నదాతలకు కల్పవృక్షం ఆర్బీకేలు
- మంత్రి ఆర్కే రోజా

విజయపురం (నగరి) : సచివాలయం ప్రజలకు సేవాలయమని, ఆర్బీకే రైతులన్నలకు కల్పవృక్షమని పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం విజయపురం మండలం జగన్నాథపురంలో రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయం, రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్బీకే భవనాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, పౌర సేవలు ప్రజలందరికీ సులభంగా అందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకు వచ్చారని తెలిపారు. పాదయాత్రలో గ్రామ, పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను జగనన్న కళ్లారా చూశారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయాల వ్యవస్థకు శ్రీకారం చుట్టి లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారని పేర్కొన్నారు. మండల కేంద్రాలకు పరుగులు తీసిన ప్రజలకు గ్రామస్థాయిలోనే సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. అర్హత ఉంటే సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందుతున్నాయని తెలిపా రు. సర్టిఫికెట్ కోసం మండల కేంద్రానికి పరుగులు తీసే రోజులు పోయాయని, జగనన్న సురక్ష పథకం కింద ఇంటి వద్దే సర్టిఫికెట్లు ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

ఒకప్పుడు వ్యవసాయం చేయాలంటే ప్రతి పనికి మండల కేంద్రాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సివచ్చేదని, నేడు వ్యవసాయం అంటే పండుగ అనే పరిస్థితులను ముఖ్యమంత్రి జగనన్న కల్పించారన్నారు. ప్రతి గ్రామంలో రైతుకు అందుబాటులో ఉండేలా రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేశారని, విత్తనాల నుంచి ధాన్యం విక్రయం వరకు, ఎరువులు, వ్యవసాయ యంత్ర పరికరాలన్నీ ఆర్బీకేల్లోనే లభిస్తున్నాయని మంత్రి ఆర్కే రోజా తెలిపారు. కార్యక్ర మంలో ఎంపీపీ జమున, వైస్ ఎంపీపీ బాలాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గోపినాథ్, నాయకులు గుణశేఖర్‌రెడ్డి, శివరాజు, హరినాయుడు, సుధాకర్‌రాజు, నారాయణరాజు, అధికారులు, ప్రజానిధులు తదితరులు పాల్గొన్నారు.

మా 'నేస్తం'నువ్వే!



వైఎస్సార్ నేతన్న నేస్తం కార్యక్రమానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. వెంకటగిరిలో శుక్రవారం జరగనున్న రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేపట్టారు. ముఖ్యమంత్రి హోదాలో మొదటిసారి వెంకటగిరికి వస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. సభకు హాజరు కానున్న నేత కార్మికులకు సకల వసతులు కల్పించారు. వేలాది మంది కూర్చొని వీక్షించే విధంగా సభావేదికను అందంగా ముస్తాబు చేశారు.

- నేడు వెంకటగిరిలో 'వైఎస్సార్ నేతన్న నేస్తం'
- బటన్ నొక్కి నగదు జమచేయనున్న సీఎం వైఎస్ జగన్
- భారీ ఏర్పాట్లు చేపట్టిన అధికార యంత్రాంగం



సిద్ధమైన సభా ప్రాంగణం



సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి తదితరులు

వెంకటగిరి: పట్టణంలోని ఎస్‌ఎల్‌ఆర్ కల్యాణ మండపం సమీపంలోని మైదానంలో వైఎస్సార్ నేతన్న నేస్తం కార్యక్రమాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించనున్నారు. నేతన్నలకు ఐదో విడత మొత్తాన్ని బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయనున్నారు. ఈ మేరకు అధికారులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఉపముఖ్యమంత్రి కే.నారాయణస్వామి, వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, సీఎం ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలసిల రఘురామ్, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కోనేటి ఆదిమూలం, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, నియోజకవర్గ పరిశీలకులు సత్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం తదితర నేతలతోపాటు, కలెక్టర్ కే.వెంకటరణారెడ్డి, ఎస్పీ రమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లా వ్యాప్తంగా చేనేత కార్మికులు హాజరుకానున్న నేపథ్యంలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. హెలీప్యాడ్ ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి క్రాస్ మీదుగా వైఎస్సార్ ప్రాంగణం వరకు రోడ్డు మార్గాన భారీ ఎత్తున స్వాగత ఏర్పాట్లు చేశారు.

నేతన్నలతో మమేకం కానున్న సీఎం జగనన్న

బహిరంగ సభాప్రాంగణం వద్ద సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి చేనేత కార్మికులతో ముచ్చటించనున్నారు. వారితో కలిసి ఫొటోషూట్ కార్యక్రమంలో పాల్గొనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో గురువారం ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ట్రయల్ రన్ నిర్వహించారు.

1,500 మంది పోలీసు బందోబస్తు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెంకటగిరి పర్యటన నేపథ్యంలో 1,500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ మేరకు స్థానిక ఎస్‌ఎల్‌ఆర్ కల్యాణ మండపంలో బందోబస్తు సిబ్బంది, పోలీసు ఉన్నతాధికారులతో ఎస్పీ సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. హెలీప్యాడ్ నుంచి సభాప్రాంగణం వరకు సీఎం రోడ్డు మార్గాన రానున్న నేపథ్యంలో ఆ మార్గంలో విధుల్లో ఉండే పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. అదనపు ఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, మునిరామయ్య, డిఎస్పీ గిరిధర పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో గురువారం అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్‌ఐ అమ్మిరెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. హెలీప్యాడ్ వద్ద బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు.

- వారంలో రెండు రోజులు రాజకీయ పార్టీల సమావేశాలు
- రాజకీయ పార్టీలు బీఎల్‌ఏల జాబితాను పంపాలి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ షణ్మోహన్

పకడ్బందీగా ఓటర్ల జాబితా



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పక్కా ఓటర్ల జాబితా తయారీ కసరత్తు పకడ్బందీగా చేపడుతున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఓటర్ల జాబితా సవరణ, సంక్షేమ, అభివృద్ధి పనుల పురోగతిపై ఆయా శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పారదర్శక ఓటర్ల జాబితా తయారీకి కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. ఓటరు జాబితాలో పేర్లు చేర్పు, తొలగింపు జాబితాను ప్రతి శనివారం సచివాలయాల పరిధిలో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి మంగళవారం నియోజకవర్గ స్థాయిలో, ప్రతి బుధవారం జిల్లా స్థాయిలో రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 7 నియోజకవర్గాల పరిధిలో 1,737 పోలింగ్ స్టేషన్లకు బీఎల్వోలను నియమించి, జాబితాను వెబ్‌సైట్‌లో పెట్టినట్లు తెలిపారు. రాజకీయపార్టీలు బీఎల్‌ఏలను నియమించి జాబితాను పంపాలన్నారు.

జిల్లాలో 15,46,691 మంది ఓటర్లు

ఎపిక్ కార్డులకు ఆధార్ లింక్ ప్రక్రియ జిల్లాలో 91.87 శాతం పూర్తి అయ్యిందన్నారు. జిల్లాలో 20 జూలై 2023 నాటికి 7,66,708 మంది పురుషులు, 7,79,874 మంది స్త్రీలు, 109 మంది హిజ్రాలు మొత్తం 15,46,691 మంది ఓటర్లుగా నమోదు అయినట్లు తెలిపారు. డీఆర్వో రాజశేఖర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు వేగవంతంగా చేపట్టండి

జిల్లా వ్యాప్తంగా గృహ నిర్మాణాల పనులు వేగవంతంగా చేపట్టాలని జిల్లా అధికారుల సమీక్షలో కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలులో జిల్లాను అగ్రగామిగా నిలపిందేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మండలానికి సుమారు రూ.కోటి వరకు ఉపాధి హామీ పనులు మంజూరు అయ్యాయని, పనిదినాల పెంపునకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్ రెడ్డి, హౌసింగ్ పీడీ పద్మనాభం, డ్వామా పీడీ గంగా భవాని, సీపీఓ ఉమాదేవి, డీడీ సోషల్ వెల్ఫేర్ రాజ్యలక్ష్మి, డీపీఓ లక్ష్మి, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి ప్రభాకర్, డెయిరీ డెవలప్‌మెంట్ అధికారి రవీంద్ర, డీసీఓ బ్రహ్మానందరెడ్డి, డీఆర్‌డీఏ ఏపీడీ రవి, డీపీఆర్‌సీ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం పట్టివేత


నిందితుడి అరెస్ట్ చూపిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: తవణంపల్లె మండలంలో ఎస్ఈబీ అధికారులు గురువారం చేపట్టిన దాడుల్లో కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా..తవణంపల్లి మండలం ఎడమలవారిపల్లె క్రాస్‌లో ఎస్ఈబీ, అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఢిల్లీబాబు(52) అనే వ్యక్తి నుంచి 92 కర్ణాటక మద్యం బాటిళ్లు పట్టుబడింది. అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు మోహన్‌బాబు, కృష్ణయ్య, సుబ్రమణ్యం గౌడ్, సిబ్బంది కిరణ్‌కుమార్, వెంకటేష్, మమత, పృధ్వీ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అగ్రికల్చర్: డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా రథాల్లో పైలెట్ (డ్రైవర్) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ గణపతి నరేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణత సాధించి, 35 ఏళ్లలోపు వయస్సు, ఏడాదిపాటు అనుభవం, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని పేర్కొన్నారు. అదనపు వివరాల కోసం 9154970183 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

సచివాలయ అడ్మిన్ ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరం ఎంజీఆర్ వీధిలోని 37వ డివిజన్ సచివాలయ అడ్మిన్ సాజాలత(37) గురువారం ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా.. కట్టమంచికి చెందిన రవీంద్రబాబు కుమార్తె సాజాలత సచివాలయ అడ్మిన్‌గా పనిచేస్తోంది. గురువారం ఉదయం వేలూరు గోల్డ్ అండ్ టెంపుల్‌కు వెళ్లి గెస్ట్‌హౌస్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తమిళనాడు వేలూరు పరిధిలోని అరియూర్ పోలీసులు సమాచారం అందుకుని కేసు నమోదు చేశారు. మూడు నెలల కిందట ఈమె తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. మృతి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

హామీ అక్షర సత్యం!

తొమ్మిదేళ్ల అక్షరాస్యత కోసం కృషి చేసిన సాక్షరభారత్ కో–ఆర్డినేటర్లను టీడీపీ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా విధుల నుంచి తొలగించింది. దీంతో వీరి బతుకులు రోడ్డున పడ్డాయి. కనీసం ప్రత్యామ్నాయం చూపమన్నా నాటి చంద్రబాబు సర్కారు కనికరించలేదు. వెట్టిచాకిరీ చేయించుకున్న చంద్రబాబు వారికి ఉపాధి లేకుండా చేయడంతో వారు కుంగిపోయారు. తమకు న్యాయం చేయాలంటూ నాడు పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డిని కలసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. అధికారంలోకి వచ్చాక తప్పక న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని ఆయన నిలబెట్టుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 65 మంది బతుకుల్లో వెలుగులు నింపారు. వారిని స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్లుగా నియమించారు.

- నాడు బాబు సాగనంపారు.. నేడు జగనన్న ఉద్యోగాలిచ్చారు
- పాదయాత్ర హామీ నిలబెట్టుకున్న జగన్‌మోహన్‌రెడ్డి
- స్వచ్ఛ భారత్‌లో కోఆర్డినేటర్లుగా ఉద్యోగాలు
- జగనన్నకు రుణపడి ఉంటామంటున్న కోఆర్డినేటర్లు


పాదయాత్రలో వైఎస్ జగన్‌కు సమస్యను విన్నవిస్తున్న ఎంసీఓలు(ఫైల్)


ఇటీవల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలసి కృతజ్ఞతలు చెబుతున్న ఎంసీఓలు (ఫైల్)

పలమనేరు: సాక్షర భారత్‌లో మండల కోఆర్డినేటర్లుగా పనిచేసి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి కోల్పోయిన వారినందరినీ స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్లుగా నియమిస్తూ ఆదేశాలు జారీ కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 66 మండలాలు ఉండేవి. ఒక్కో మండలానికి ఒక్కో కోఆర్డినేటర్, 1,363 పంచాయతీల్లో 2,600మంది పంచాయతీ కోఆర్డినేటర్లు గ్రామాల్లో అక్షరాస్యతను పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో 2010లో సాక్షరభారత్‌ను ప్రారంభించింది. వీరు గ్రామాల్లో ఉదయం, సాయంత్రం అక్షరాస్యత కేంద్రాలు, ఏఈఎస్(అడల్ట్ ఎడ్యుకేషన్ సెంటర్స్)ను నడిపేవారు. గ్రామ కోఆర్డినేటర్‌కు నెలకు 2వేలు, మండల కోఆర్డినేటర్‌కు రూ.6 వేలు గౌరవ వేతనంగా ఇచ్చేవారు. ఈ కార్యక్రమం 2018 డిసెంబర్‌తో ముగిసిందని వీరందరినీ విధులనుంచి చంద్రబాబు ప్రభుత్వం తొలగించిందింది.

ప్రభుత్వ కార్యక్రమాలకు వెట్టిచాకిరీ

సాక్షర భారత్ కేంద్రాల మాట దేవుడెరుగు నాటి టీడీపీ ప్రభుత్వం వీరిని ప్రభుత్వ పథకాలకు ఏజెంట్లుగా వాడుకుంది. ముఖ్యంగా జనధన్ ఖాతాలు తెరిపించడం, నవనిర్మాణ దీక్షలు, జన్మభూమి కార్యక్రమాలు, జియో టాగింగ్, స్వచ్ఛభారత్, ఓడీఎఫ్, ఇంటి పన్నుల వసూళ్లు, ఓటర్ల నమోదు ఇలా అన్ని రకాల కార్యక్రమాల్లో వెట్టి చాకిరీ చేయించుకుంది.

ప్రభుత్వానికి మంచి పేరు తెస్తాం

ఏళ్లపాటు సేవలు చేసుకుని విధుల నుంచి తొలగించడంతో వీధిన పడిన మండల కోఆర్డినేటర్లు ఓ సంఘంగా ఏర్పడి న్యాయం కోసం సిద్ధపడ్డారు. అదే సమయంలో రాష్ట్రంలో ప్రజాసంకల్ప పాదయాత్ర చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆళ్లగడ్డ నియోజకవర్గం దోర్నిపాడులో కలసి తమ బాధలను చెప్పుకున్నారు. దీనిపై స్పందించిన ఆయన అధికారంలోకి వచ్చాక తప్పకుండా ఉద్యోగాలకు కల్పిస్తామంటూ మాటిచ్చారు. ఇచ్చిన మాటను ప్రస్తుత ముఖ్యమంత్రి నిలబెట్టుకున్నారు. రాష్ట్రంలోని సాక్షరభారత్‌లో మండల కోఆర్డినేటర్లుగా పనిచేసిన వారందరినీ స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్లుగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. వీరు ఆయా మండలాల్లో గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం, తడిచెత్త, పొడిచెత్త సేకరణ, చెత్త నుంచి సంపద తయారీ, సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ పనులను పర్యవేక్షించేలా మళ్లీ ఉద్యోగాలను కల్పించారు. దీంతో రాష్ట్రంలోని మండల కోఆర్డినేటర్లు ఇటీవలే సీఎంను కలిశారు. మా కుటుంబాలు ఎప్పటికీ రుణపడి ఉంటాయని కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా పనిచేస్తామని పేర్కొన్నారు.

నాడు నిర్దాక్షిణ్యంగా తొలగించారు



ప్రభుత్వ కార్యక్రమాలకు తలలో నాలుకలా వ్యవహరిస్తే గత టీడీపీ ప్రభుత్వం మాకు అన్యాయం చేసింది. 9నెలలు వేతనాలు ఇవ్వకుండా ఉద్యోగాల నుంచి నిర్దాక్షిణ్యంగా తొలగించింది. రోడ్డున పడిన తమకు న్యాయం చేయాలంటూ పాదయాత్రలో జగనన్నను కలిసి వేడుకున్నాం. నాడు ఆయనిచ్చిన మాటను నేడు నెరవేర్చారు. మాకుటుంబాల్లో వెలుగులు నింపారు. – సిద్దారెడ్డి, సాక్షరభారత్ మండల కో–ఆర్డినేటర్ల రాష్ట్రఅధ్యక్షుడు

నేడు జగనన్న ఆదుకున్నారు



ఉన్నఫలంగా తమ ఉద్యోగాలను తీసేయడం న్యాయం కాదంటూ నాటి ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో తామంతా పాదయాత్రలో జగనన్నను కలసి మా బాధను తెలుపుకున్నాం. నాడు ఆయన తమకిచ్చిన హామీని నిలుపుకున్నారు. స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్లుగా నియమించడం చాలా ఆనందంగా ఉంది. – కె.సుబ్బారావు, ఎంసీవోల సంఘ రాష్ట్ర కార్యదర్శి



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,460
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.79.00

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

చిత్తూరు కలెక్టరేట్ : ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 21 నుంచి నిర్వహించే ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పుల కసరత్తును పకడ్బందీగా చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో రోజుకు 40 ఇళ్లకు తక్కువ కాకుండా పరిశీలించి ఆధారాలతో రికార్డులను సమర్పించాలని తెలిపారు. ఈనెల 21 ఉదయం 9 గంటల నుంచి ఈ కార్యక్రమం మొదలు కావాలని, అనంతరం రోజు సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల వరకు క్షేత్ర స్థాయిలో పరిశీలన కార్యక్రమం నిర్వహించాలనన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులను వేరువేరు పోలింగ్ కేంద్రాలకు విభజించకూడదని చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం


హేమంత్‌రెడ్డి


ధరణీష్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: ఫుట్‌బాల్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడిగా హేమంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ధరణీష్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ చిత్తూరు జిల్లా నూతన కమిటీ సభ్యులను ప్రకటించారు. కార్యదర్శిగా కిషోర్ (పలమనేరు), సంయుక్త కార్యదర్శిగా మునికుమార్ (పులిచెర్ల), ట్రెజరర్‌గా పవన్‌కల్యాణ్(కుప్పం), మెంబర్లుగా రవికుమార్, వినోద్‌రెడ్డి ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా హేమంత్ రెడ్డి మాట్లాడుతూ గత ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.

అమాయకమే ఆధారం..దొరికినంత దోచేస్తాం!



ఈనెల 18 మంగళవారం ఉదయం 11.09 నిమిషాలకు చౌడేపల్లె బజారు వీధికి చెందిన ఏ.రాజేశ్వరికి 09643261376 నంబర్‌తో ఫోన్ వచ్చింది. చిత్తూరు డ్వాక్రా మహిళా సంఘం కార్యాలయం నుంచి కాల్ చేస్తున్నామని, మీ అకౌంట్ నంబర్‌కు డబ్బులు పంపుతున్నాం.. మీ ఫోన్‌పే నంబరుకు డబ్బులు పంపామని, తాము పెట్టిన ఓచర్‌ను క్లిక్ చేసి బ్యాలెన్స్ చూపి చెప్పాలంటూ ఫోన్ చేశారు. ఆమె ఫోన్‌లైన్‌లో ఉండగా ఏడు సార్లు ఓచర్లు పంపి తనవద్ద క్లిక్ చేయిస్తూ రూ.54,655 విత్ డ్రా చేశారు. అలాగే ఆమె భర్త జయప్రకాష్ ఖాతాలో ఉన్న రూ.10,575 నగదు విత్‌డ్రా చేశారు. అతని స్నేహితుడు ఓదులపేటకు చెందిన సురేంద్రరెడ్డి ఖాతాలో ఉన్న రూ.12వేలు కాజేశాడు. ఇందంతా క్షణాల వ్యవధిలో జరిగిపోయింది. ఆ తరువాత వరుసగా డబ్బులు విత్ డ్రా అయినట్లు మెసెజ్‌లు రావడంతో బ్యాంకు వద్దకు పరుగులు తీశారు. అప్పటికే బ్యాంకు ఖాతాలో డబ్బులు డ్రా అయినట్లు గుర్తించి చౌడేపల్లె పోలీసులకు ఫిర్యాధుచేశారు. గత వారం కెనారా బ్యాంకు సమీపంలో మరొకరికి చెందిన రూ.60 వేలు ఇదే తరాహాలో డ్రాఅయినట్లు తెలిసింది. ఇలా మహిళా సంఘాల సభ్యులను సైబర్ క్రైమ్ ముఠా మభ్యపెట్టి దొరికినంతా దోచుకుంటోంది.

రెచ్చిపోతున్న సైబర్ కేటుగాళ్లు

- స్వయం సహాయక సంఘాల మహిళలే టార్గెట్
- నలుగురి వద్ద రూ.1.47 లక్షలు స్వాహా

చౌడేపల్లి: 'మేము అధికారులం. మీ బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు వేయాలి. ఓటీపీ చెప్పండి'.. అంటూ ఒకరు.. 'ఫోన్‌పేకి డబ్బులు పంపాం.. డబ్బులు పంపిన ఓచర్‌పై క్లిక్ చేసి బ్యాలెన్స్ చెప్పండి' అని మరొకరు.. అమాయకులైన మహిళలకు ఫోన్ చేసి బురిడీ కొట్టిస్తున్నారు. తీరా తమ బ్యాంక్ ఖాతాల్లో నగదు జమకాకపోగా.. ఉన్న డబ్బులు ఊడ్చేస్తుండడంతో గాబరాపడి పోలీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లాలో నిత్యం ఇలాంటి ఘటనలు ఏదో ఒకచోటు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. సైబర్ కేటుగాళ్ల వలకు చిక్కి అమాయక ప్రజలు గిలగిల్లాడాల్సి వస్తోంది. సమస్య ఎవరికి చెప్పుకోవాలో తెలియక పలువురు గుండెనిండా బాధ నింపుకుని దిగాలుగా ఇంటిపట్టునే ఉండిపోతున్నారు.

న్యాయం చేయండి



నేను నాభార్య సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి బలైపోయాం. మొత్తం రూ.77వేలకు పైగా పోగొట్టుకున్నాం. నాస్నేహితుడు కూడా రూ.12 వేలు పోగొట్టుకున్నాడు. జరిగిన మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. న్యాయం చేయండి. – జయప్రకాష్, చౌడేపల్లె

ఫిర్యాదు చేయండి



సైబర్ క్రైం ద్వారా నగదు మోసపోయిన బాధితులుంటే మాకు ఫిర్యాదు చేయండి. అలాగే అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు, బ్యాంకు వివరాలు, ఆధార్ వివరాలు అడిగితే ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వొద్దు. ఎలాంటి సందేహం ఉన్నా నేరుగా బ్యాంకులకెళ్లి వివరాలు తెలుసుకోండి. – రవికుమార్, ఎస్ఐ, చౌడేపల్లె

భూతగాదాలతో రైతు హత్య


మృతిచెందిన రవి


దగ్ధమైన ఇళ్లు

రామకుప్పం: భూతగాదాలతో రైతు హత్య గురైన సంఘటన రామకుప్పం మండలంలో గురువారం జరిగింది. ఎస్ఐ కృష్ణయ్య కథనం మేరకు.. మండలంలోని ముద్దనపల్లి పంచాయతీ ఆవులకుప్పం గ్రామానికి చెందిన రవికి మొద్దులవంక గ్రామంలో సర్వే నెం 384/1 లో 1.40 సెంట్ల భూమి ఉంది. ఇదే విషయంగా పక్కన పొలం రైతు జగన్నాథ్ మధ్య తగాదా ఉంది. గురువారం ఉదయం రవి, ఆయన భార్య యశోదమ్మ పొలం దగ్గరకు వెళ్లారు. ఈ సమయంలో జగన్నాథ్ అక్రమంగా రవికి చెందిన భూమిని దున్నేందుకు ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. రవి కుటుంబసభ్యులు వారిని అడ్డుకోవడంతో వెళ్లి పోయారు. కొద్దిసేపటికి జగన్నాథ్ కుటుంబ సభ్యులు రవిపై దాడికి పాల్పడ్డారు. ఆ సమయంలో జగన్నాథ్ గడ్డపారతో రవి తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రవి హత్య సమాచారం తెలుసుకున్న ఆవులకుప్పంలోని అతని బంధువులు ఘటన స్థలానికి చేరుకుని జగన్నాథ్, కుటుంబసభ్యుల ఇళ్లను దగ్ధం చేశారు. మంటల్లో ఇళ్లలోని వస్తువులన్ని కాలిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ కృష్ణయ్య సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిస్థితిని సద్దుమణిగించారు. సంఘటన స్థలాన్ని పలమనేరు డీఎస్పీ సుధాకర్ రెడ్డి, సీఐలు శ్రీధర్, ఆశీర్వాదం పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మృతుని భార్య యశోదమ్మ ఫిర్యాదు మేరకు జగన్నథ్, అతని భార్య కౌసల్య, కుమారుడు ప్రవీణ్, తమ్ముళ్లు మంజు, ప్రశాంత్, సాలమ్మ ,ప్రమీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

బైక్ ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు


అంబులెన్స్‌లోకి ఎక్కించడంలో సహాయపడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: పలమనేరు– బెంగుళూరు జాతీయ రహదారిలో జరిగిన బైక్ ప్రమాదంలో యువకుడికి తీవ్ర రక్తగాయాలై పరిస్థితి విషమంగా మారింది. ఈ ఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. మండలంలోని గంగ్రాజుపల్లి పంచాయతీ పెద్దఉగినికి చెందిన ఆసిమ్ కుమారుడు ఫైజుల్లా(18) ఇంటర్ చదువుతున్నాడు. జ్వరం రావడంతో ఆస్పత్రికి వెళ్లేందుకు పలమనేరుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. పొన్నమాకులపల్లి సమీపంలో ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని వెనుక నుంచి ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు.

ఆపదలో ప్రాణదాతగా ఎమ్మెల్యే వెంకటేగౌడ

గడపగడప కార్యక్రమంలో భాగంగా అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదాన్ని గమనించారు. తన కాన్వాయ్‌ని ఆపి రోడ్డుపై ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న యువకుడిని 108 అంబులెన్స్‌లోకి ఎక్కించడంలో సహాయపడ్డారు. పలమనేరు ప్రభుత్వాస్పత్రి వైద్యులకు ఫోన్ చేసి యువకుడికి మంచి వైద్యం అందించాలని ఆదేశించారు. అయితే యువకుడి పరిస్థితి విషమించడంతో కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాలకు రెఫర్ చేశారు. ఎమ్మెల్యే కుప్పంలో ఉన్న ఎమ్మెల్సీ భరత్‌కు జరిగిన ప్రమాదం విషయాన్ని ఫోన్ ద్వారా సమాచారం అందించారు. మెరుగైన చికిత్స అందించేలా చూడాలని కోరారు.


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు

మీ అమ్మాయికి ధనపిశాచి పట్టిందని..

- ఇంట్లో విలువైన వజ్రాలున్నాయని నమ్మించి..
- గోతి తవ్వి రెండు నకిలీ వజ్రాలిచ్చారు
- తీరా పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు
- గంటావూరులో ఘటన


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు (ఇన్‌సెట్) బాధితుడికి అంటగట్టిన నకిలీ వజ్రాలు

పలమనేరు: తమ కుమార్తెకు ఆరోగ్యం బాగోలేదని ఓ మందిరానికి వెళ్లిన తల్లిదండ్రులను ఏమార్చాడో మాంత్రికుడు. మీ అమ్మాయిని ఎక్కడకు తీసుకెళ్లినా రోగం నయంకాదన్నాడు. దీనికి కారణం మీ ఇంట్లో రూ.కోట్లు విలువజేసే వజ్రాలున్నాయన్నాడు. ధన పిశాచి మీ కూతురి ఒంట్లో చేరడంతో జబ్బున పడిందని పక్కాగా నమ్మించాడు. ఆపై బాధితులను ఏమార్చా కటకటాలపాలయ్యాడు. పలమనేరు అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని గంటావూరు కాలనీకి చెందిన సయ్యద్‌బాషా కుమార్తెకు కొన్నాళ్లుగా ఆరోగ్యం బాగోలేదు. గాలి సోకిందని ఎవరో చెప్పారని మదనపల్లి సమీపంలోని యాతాళవంక వద్ద దర్గాకు ఈనెల ఒకటో తేదీన తీసుకెళ్లారు. అక్కడ సయ్యద్‌బాషా భార్యకు దూరపు బంధువైన అజీజ్ అలీ వారికి కనిపించి విచారించగా బిడ్డకు ఆరోగ్యం బాగోలేదని చెప్పారు. ఇవన్నీ కాదు తన స్నేహితుడున్నాడని అతనికి చూయిస్తే ఎలాంటి రోగాన్నైనా నయం చేస్తాడని తాము గంటావూరుకే వస్తామంటూ తెలిపాడు. దీంతో మదనపల్లెకు చెందిన రెడ్డి నరసింహులు, అజీజ్ అలీ వారింటికి వెళ్లి, వారికుమార్తెను పరిశీలించి ఇంట్లో భారీగా వజ్రాలున్నాయనియ ధన పిశాచి మీ కుమార్తెను పట్టుకుందని నమ్మించారు. ఇందుకు విరుగుడుగా మంచి ముహూర్తం చూసి మీ ఇంట్లోని వజ్రాలను వెలికితీసి అందులోని ఓ వజ్రాన్ని మీ కుమార్తెకు ఉంగరంగా తొడగాలని చెప్పారు. దీంతో ఈనెల 18న అమావాస్య రోజు సయ్యద్‌బాష ఇంటిలోని బెడ్‌రూంలో గుప్తనిధులున్నాయని చెప్పిన చోట ఐదడుగులు గోతిని తీసి ఈ ఇద్దరూ పూజలు చేశారు. అక్కడ రెండు విలువైన వజ్రాలు లభించాయంటూ నకిలీవి సయ్యద్‌బాషాకు ఇచ్చారు. అతని నుంచి రూ.20 వేలు పూజా ఖర్చులకు తీసుకొన్నారు. ఇదే గోతిలో ఇంకా చాలా విలువైన వజ్రాలున్నాయని అతన్ని నమ్మించారు. ఇందుకోసం ఇంకా చాలా ఖర్చు అవుతుందని చెప్పారు. అయితే ఇక్కడ జరుగుతున్న తతంగాలపై స్థానికుల సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు నిఘా ఉంచారు. ఇదే సమయంలో తనకు దీనిపై అనుమానముందంటూ బాధితుడు పోలీసులను బుధవారం ఆశ్రయించాడు. గురువారం మళ్లీ గంటావూరులోకి ఇంటివద్దకు వచ్చిన అజీజ్, రెడ్డి నరసింహలును స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో నకిలీ వజ్రాలతో మోసం చేస్తున్నట్లు అంగీకరించారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఇలాంటి వారి మాయ మాటలను ప్రజలు నమ్మరాదని సీఐ చంద్రశేఖర్ హెచ్చరించారు.